క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

భీమడోలు: బాల్య వివాహాలను అరికడదాం–భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో గురువారం పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురం గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. బాల్య వివాహాల రహిత దేశంగా చేసేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంరక్షణ కార్యదర్శి పి.లక్ష్మీ సుజనా మాట్లాడారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలను చేపడితే చైల్డ్ లైన్ 1098కు ఫోన్ చేయాలని కోరారు. మైనర్లకు వివాహాలు చేస్తే బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రాఫ్ సిబ్బంది చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి శిక్షణ

దెందులూరు: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సత్రంపాడులో ఈ నెల 13 నుంచి శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ ఎం.ఫణికిషోర్ అన్నారు. ప్రచారంలో భాగంగా గురువారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉన్న వారికి డీటీపీ, సీసీటీవీ కెమెరా రిపేరింగ్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో భోజనం వసతి ఇస్తామని శిక్షణ పూర్తయిన తరువాత టూల్ ద్యూటీ ఇస్తామన్నారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలని మరిన్ని వివరాలకు 9948565256, 9502723561, 901404780 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బోధనేతర పనుల బహిష్కరణ



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

భీమడోలు: ఈ నెల 10వ తేదీ శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో మండల నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం భీమడోలు మండలంలోని ఫ్యాప్టో నాయకులు భీమడోలు మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో–1 ఇ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్‌ల వలన సమాచారం అప్‌లోడ్ చేయడానికి సమయం వృథా అవుతుందని, విద్యార్థులకు బోధన కష్టంగా మారిందన్నారు. నేటి నుంచి టీచర్, విద్యార్థుల హాజరు, ఎండీఎం నిర్వహణ అంశాలు తప్ప ఇతర యాప్‌ల్లో సమాచారం అప్‌లోడ్ చేయబోమని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో మండల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలి

భీమడోలు: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థుల ఎసెస్‌మెంట్ బుక్స్, వర్క్ పుస్తకాలు, నోటు పుస్తకాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలల రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ఫార్మేటివ్–2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రఘురామరాజు, టీచర్ మండే సుధాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రజలకు మేలు

భీమడోలు: జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు కలుగుతుందని డీసీహెచ్‌ఎస్ పాల్ సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీల్లో గురువారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. జిల్లా ముఖ్య ఫార్మసీ అధికారి మునగంటి మహీధరాచార్యులు, ఎఎంసీ చైర్మన్ శేషగిరి, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాస్, మాజీ ఎఎంసీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య, ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు, మధుసూధన్ పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

ఉంగుటూరు: కైకరం సుందర సీతారామ స్వామి కొణింగ రామాలయం మూలనిధికి దాత కూన అప్పారావు, కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు ఎండ రామదాసు, గౌరవ సలహాదారు కొచ్చర్లకోట శ్రీనివాస్, కార్యదర్శి కె.అప్పారావు, ఉపాధ్యక్షుడు సంపతి ఆంజనేయులు సమక్షంలో దాత కూన అప్పారావు, కుటుంబ సభ్యులు ధనలక్ష్మి ప్రసన్న కుమారి, కూన పద్మజాహ్నవి ఆలయానికి చెక్కును అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇదేనా.. స్వచ్ఛ ఆంధ్ర?

- ప్రజల్లో కానరాని మార్పు
- అధికారుల చర్యలు శూన్యం
- బోర్డులు పెట్టిన చోటే చెత్త, కొబ్బరి బొండాలు



రోడ్డు పక్కన వేసిన చెత్త



రోడ్డు పక్కన వేసిన ఖాళీ కొబ్బరి బొండాలు

దెందులూరు: ప్రజల్లో బాధ్యత లేక మార్పు అందకపోవడంతో ఉద్యోగులు అధికారులు మెతక వైఖరి అవలంబించడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రభుత్వం ప్రచారాల్లో కఠినంగా ఉండటమే తప్ప అమల్లో వైఫల్యం చెందటంతో ఏ గ్రామంలో చూసినా చెత్తాచెదారం, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఎక్కడపడితే అక్కడ దర్శనం ఇవ్వటం గమనార్హం. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మరో అడుగు ముందుకేసి ఎక్కడ బోర్డులు పెట్టారో అక్కడే ఖాళీ కొబ్బరి బొండాలు, చెత్తాచెదారం ప్లాస్టిక్ వ్యర్థాలు వేయటం పరాకాష్టకు నిదర్శనం. నియోజవర్గంలో దాదాపు ప్రతి గ్రామంలోనూ బాధ్యతా రాహిత్యంగా పారిశుద్ధ్యం ఇలానే ఉంది. చెత్తాచెదారం వేయడానికి పాఠశాలలు వైద్యశాలలను మినహాయించటం లేదు. పాఠశాల గోడ పక్కనే చెత్త వేస్తున్నారు. ఆసుపత్రి పక్కనే రోడ్డు మీద కొబ్బరి బొండాలు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తున్నారు. డ్రెయిన్లు పూర్తి స్థాయిలో శుభ్రం చేసిన దాఖలాలు లేవు.

కానరాని వాటర్ ట్యాంకుల క్లీనింగ్

వాటర్ ట్యాంకుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. ప్రతి ఊరికి రెండు మూడు ఆర్వో ప్లాంట్‌లు ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పంచాయతీరాజ్ శాఖ నిబంధనల ప్రకారం ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి నెలా శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లాలి. ట్యాంక్ మీద చేసిన తేదీ మళ్లీ నెల చేయబోయే తేదీ రెండూ రాయాలి. ఈ పరిస్థితి నియోజకవర్గంలో ఎక్కడా కనిపించడం లేదు. అధికారులు ఉద్యోగుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పూర్తి స్థాయిలో డ్రెయిన్లు శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా పెరగటం, అవి కుట్టడం వలన జనం అనారోగ్యానికి గురవుతూనే ఉన్నారు. నియోజకవర్గంలో ప్రతి షాపులో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్ల అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అయినా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం ప్రచారానికే పరిమితం కావడంతో ప్రజల్లో ఆశించిన మేరకు మార్పు కనిపించడం లేదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

చర్యలు కఠినంగా ఉండాలి



ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్య అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అధికారులు మారని పరిస్థితులపై ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలి. మార్పు కోసం గ్రామాల అభివృద్ధి ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా కఠినంగా వ్యవహరించకపోతే పరిస్థితులు సానుకూలంగా ఎలా ఉంటాయి. ఎప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటారో అప్పుడే అన్ని షాపుల్లో ప్లాస్టిక్ సంచుల విక్రయాలు ఆగుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

–తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

ఉచిత బస్సు.. అంతా తుస్సు



ఉచిత బస్సుపై ప్రజాభిప్రాయాన్ని ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న విద్యార్థులు

గణపవరం: ఉచిత బస్సు పథకం వలన పెద్దగా ఒరింగిదేమీ లేదని, తగినన్ని సర్వీసులు ఏర్పాటు చేయకపోవడం వలన అటు మహిళలకు, ఇటు పురుషులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు అభిప్రాయపడ్డారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అర్థశాస్త్ర విభాగం హెడ్ కె.స్వరూపరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు ఉచిత బస్ సర్వీసు పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. సర్వే నివేదికను గురువారం కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారికి అందజేశారు. ఉచిత బస్సు పథకం కేవలం మహిళలకు ఇవ్వడం కన్నా, విద్యార్థులు, వయోవృద్ధులు, వికలాంగులకు ఇస్తే బాగుండేదని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. మొత్తం 191 మంది నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఉచిత బస్సు పథకం వలన అవసరం లేకపోయినా ఎక్కువమంది మహిళలు బస్‌ప్రయాణం చేస్తున్నారని 48.3 శాతం మంది మహిళలు, 45.5శాతం మంది పురుషులు అభిప్రాయపడ్డారు. అలాగే పురుషులు ఈ పథకం వలన చాలా ఇబ్బందులు పడుతున్నారని, బస్సులు నిత్యం రద్దీగా ఉండి ప్రైవేటు వాహన వినియోగం పెరిగి అదనపు ఖర్చు అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. చాలా రూట్లలో ఆర్టీసీ బస్ సౌకర్యం లేకపోవడం వలన ఈ పథకం ఎక్కువ మంది గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపయోగపడటం లేదని, బస్సుల సంఖ్య, ఆర్టీసీ సిబ్బందిని పెంచాలని పలువురు అభిప్రాయపడ్డారు. మొత్తంగా ఉచిత బస్సు తుస్సుమందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

అవగాహనతోనే అభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు

దెందులూరు: విద్యార్థులు పలు అంశాలపై అవగాహనతోనే అభివృద్ధి సాధ్యమని ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. గురువారం జోగన్నపాలెం మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాలలో ఫౌండర్ కరస్పాండెంట్ వసీవుల్లా అధ్యక్షతన విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాట వింటూ లక్ష్యాన్ని ఎంచుకోవాలన్నారు. క్రమశిక్షణ, నిరంతర సాధన, సత్ప్రవర్తనతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. సమాజంలో నేరాలు చట్టాలు శిక్షలు మోసాలు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్య ద్వారా ఏ రంగంలోనైనా రాణించొచ్చన్నారు. దెందులూరు ఎస్సై రాచమల్లు శివాజీ, పాఠశాల డైరెక్టర్లు మొహమ్మద్ ఒసామా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

దెందులూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధరణిని నిరసిస్తూ రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి బోధ నేతర కార్యక్రమాలు బహిష్కరిస్తున్నామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంబూరి రాంబాబు, నాయకులు జేసుదాసు, డి శ్రీనివాసరావు, టి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఏలూరు రూరల్ మండలం గుడివాడ లంకలో వారు విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు బహిష్కరణ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏలూరు రూరల్ ఎంఈఓ రవిప్రకాష్ కు అందజేయడం జరిగిందని నాయకులు వివరించారు.

హెచ్‌ఎంకు మెమో

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుభాషిణికి జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకట లక్ష్మమ్మ మెమో ఇచ్చారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థి, టీచర్‌కు షాక్ కొట్టిన పరిణామాలపై హెచ్‌ఎం సుభాషిణి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి గురువారం వెళ్లి లిఖితపూర్వకంగా రాసిచ్చారు.

కోలుకున్న విద్యార్థి కార్తీక్

కరెంట్ షాక్‌కు గురైన గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కార్తీక్ కోలుకున్నాడు. గురువారం ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ లో ఐసీయూలో ఉన్న కార్తీక్ ను గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి: మండలంలోని భోగాపురం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.91,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు. మండలంలోని భోగాపురంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీఐ పోలీసు సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ మేరకు జూదరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంటలో శ్రీరాట్నాలమ్మ దేవస్థానంలో జరిగిన నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూజల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను, చిత్ర పటాలను, ఆలయ అర్చకులు నిర్వాహకులు ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కట్నేని లక్ష్మీ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2573 ఎకరాల్లో రీసర్వే



రీసర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దెందులూరు: మండలంలో శింగవరం, వేగవరం, గోపన్నపాలెం, నాగులదేవునిపాడు గ్రామాల్లో 2573 ఎకరాల్లో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో మండల సర్వేయర్ అన్ని గ్రామాల సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు రీసర్వే పనులు చేస్తున్నారన్నారు. పారదర్శకంగా రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ముందుగానే రైతులకు నోటీసులు ఇచ్చి సరిహద్దులు నిర్ణయిస్తామన్నారు. రీ సర్వే పనులు జరుగుతున్న గ్రామాల్లో రైతులు రీసర్వే సిబ్బందికి సహకారం అందించాలని ఆమె కోరారు.

యువత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భీమడోలు: జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న తపనతో కష్టించి చదువుకోవాలని, తద్వారా ఉద్యోగాలు సొంతమవుతాయని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వి.వరలక్ష్మి అన్నారు. భీమడోలు కళాశాలలో గురువారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, చైతన్య యువజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో యువతీ యువకులకు కెరీర్ గైడెన్స్, మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలు, దుష్ప్రభావం తదితర అంశాలపై వారికి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వి.వరలక్ష్మీ, సెట్‌వెల్ సీఈవో ఎస్.ప్రభాకర్‌లు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి ఎస్.పట్టాభిరామన్న, సూపరిండెంటెంట్ కెనడీ, కళాశాల ప్రతినిధులు కె.ప్రేమ్‌కుమార్, పి.బాలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యతో జీవనోపాధి మెండు



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గణపవరం: ఒకేషనల్ విద్యతో జీవనోపాధి మెండుగా లభిస్తుందని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తోట అప్పారావు అన్నారు. గణపవరం బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పది, ఇంటర్ విద్యార్థులు దసరా సెలవుల్లో పలు వ్యాపార సంస్థల్లో 10 రోజులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి గురువారం పాఠశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవులు సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో మెలకువలు తెలుసుకోవడానికి విద్యార్థులు ప్రయత్నించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కక్షిదారులకు పారదర్శక సేవలందించాలి



దస్తావేజు లేఖర్ల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

భీమడోలు: కక్షిదారులకు పారదర్శకంగా రిజిస్ట్రేషన్ సేవలందించాలని ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మిక సందర్శన చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, వసతులను ఆయన పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే పార్టీలు, సాక్షులు, కక్షిదారుల నుంచి ఆయన వివరాలను సేకరించారు. కక్షిదారులు, సాక్షులు, దస్తావేజు లేఖర్ల నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లు స్వీకరించారు. వారు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యాలయ రికార్డులను ఆయన పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ రాఘవేంద్ర వరప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. కార్యాలయ సిబ్బందిపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కక్షిదారులకు రిజిస్ట్రేషన్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, దస్తావేజు లేఖరులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్టాటిస్టికల్ ఆఫీసర్ దాస్

దెందులూరు: పంట కోత ప్రయోగాలపై అవగాహన పెంపొందించుకోవాలని స్టాటిస్టికల్ ఆఫీసర్ దాస్ అన్నారు. గురువారం దెందులూరు రైతుసేవా కేంద్రం–2లో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్టాటిస్టికల్ ఆఫీసర్ దాస్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు చేసే విధానం తీసుకోవలసిన జాగ్రత్తలు, విశిష్టతను వివరించారు. పంటకోత ప్రయోగాల్లో పలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వైభవంగా అట్ల తద్దె పూజలు



దెందులూరు: నర్సింగ్ కళాశాలలో అట్ల తద్దె చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



గణపవరం: గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

గణపవరం: కొత్తగా పెళ్లయిన యువతులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే అట్లతద్దె పర్వదినాన్ని గురువారం మహిళలు వైభవంగా నిర్వహించారు. మహిళలు ఉయ్యాల ఊగుతూ ఆనందోత్సాహాలతో గడిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అట్లతద్దెను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. పేరంటాళ్లతో పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం నూతన వధువుతో కలిసి పేరంటాళ్లు సమీపంలోని చెరువులు, కాలువల వద్దకు వెళ్లి గౌరీదేవికి కుంకుమ పూజలు చేశారు. మహిళలు, యువతులు, చెరువుల్లో దీపాలు వదిలి గోమాతకు పూజలు చేశారు.

నర్సింగ్ కళాశాలలో అట్లతద్ది వేడుకలు

దెందులూరు: దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో గురువారం అట్లతద్ది వేడుకలు కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగవల్లితో తీర్చిదిద్ది ఉయ్యాల ఊగుతూ ఆటపాటలతో అట్లతద్ది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



బాణసంచా గోడౌన్‌ను సీఐ, ఎస్సై

గణపవరం: దీపావళి బాణసంచా వ్యాపారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని గణపవరం సీఐ నక్కా రజనీకుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన గణపవరం మండలం పిప్పరలోని బాణసంచా హోల్‌సేల్ దుకాణాలు, గోడౌన్‌లను ఎస్సై ఆకుల మణికుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా వ్యాపారులకు సూచనలు ఇచ్చారు. దుకాణాలకు సంబంధించిన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు పరిశీలించి, తగు సూచనలు ఇచ్చారు. అలాగే రిటైల్ అమ్మకందారులు ఏర్పాటు చేసుకునే దుకాణాల స్థలం, గోడౌన్‌లను ఆయన పరిశీలించి, నిర్వాహకులకు సూచనలు చేశారు.

అనుమతులు తప్పనిసరి

పెదవేగి: దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు, షాపులకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై కె.రామకృష్ణ అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు ఎస్సై బాణసంచా తయారీ కేంద్రాలు, షాపుల యజమానులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. దీపావళి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, బాణసంచా తయారీ, విక్రయాల్లో పలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.